www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 48 | 13-09-2021 | పుటలు : 4



సెప్టెంబర్ 8

అంతర్జాతీయ

అక్షరాస్యతా దినోత్సవం!

సర్వత్ర విద్యాయా వర్ధతే ప్రజా !

## ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభంపై మెరుగైన సూచనలివ్వండి

### నన్నయ రౌండ్ టేబుల్ సమావేశంలో వీసీ జగన్నాథరావు

**08.09.21 (మీడియాసెల్)** ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభంతో భారతీయ రాజకీయ,ఆర్థిక వ్యవస్థలపై ఏ విధమైన ప్రభావం ఉంటుంది,వాటి నుండి బయటపడే మార్గాలను మేధావులు సూచించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. బుధవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో "భారతీయ రాజకీయ వ్యవస్థ మరియు ఆర్థిక వ్యవస్థలపై ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభ ప్రభావం" అనే అంశంపై రౌండ్ టేబుల్ చర్చ నిర్వహించారు. పొలిటికల్ సైన్స్ విభాగం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి కోర్స్ కోఆర్డినేటర్ డా.ఎన్.రాజశేఖర్ కన్వీనర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆఫ్ఘనిస్థాన్ ను తాలిబన్లు ఆక్రమించుకోవడంతో ఏర్పడిన సంక్షోభ ప్రభావం భారతదేశంపై అధికంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా భారతదేశంలోని రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై దీని ప్రభావం ఏ విధంగా ఉంటుంది అనే విషయాలపై విశ్వవిద్యాలయంలో చక్కని చర్చ జరుగుతుందన్నారు. మేధావులు, నిపుణులు సంక్షోభ ప్రభావం నుండి బయటపడే మార్గాలను సూచించాలన్నారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించిన అంశాలను, సూచనలను ప్రభుత్వాలకు నివేదిస్తామని తెలియజేశారు. సంబంధింత అంశాలపై రాజకీయ, ఆర్థిక శాస్త్రాల అధ్యాపకులు మేధావులు తమ అభిప్రాయాలను పంచుకుంటూ కీలక విషయాలను చర్చించారు.ఆఫ్ఘన్ సంక్షోభం - అవలోకనం అనే అంశంపై జె.ఎన్.టి.యు.కె అధ్యాపకులు డా. ఆలపాటి శ్రీనివాస్, తాలిబాన్ల మూలం మరియు పెరుగుదల అంశంపై వర్సిటీ అధ్యాపకులు జె. సూరయ్య, తాలిబాన్లు ఆఫ్ఘనిస్తాన్‌ను ఎలా స్వాధీనం చేసుకున్నారనే అంశంపై డా.ఎన్. రాజశేఖర్,భారత విదేశాంగ విధానం - ఆఫ్ఘన్ సంక్షోభ ప్రభావం అనే అంశంపై డా.కె.యామినీజ్యోత్స్న, ఆఫ్ఘన్ సంక్షోభం -యు.ఎన్.ఓ పాత్ర అనే అంశంపై డా.బిక్కిన బాలకృష్ణ, ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభం - దాని పొరుగు దేశాల పాత్ర అనే అంశంపై -డా.ఎం.సత్యనారాయణ, ఇండో - ఆఫ్ఘన్ సంబంధాలు అనే అంశంపై డా.ఎన్.నానిబాబు, ఆఫ్ఘన్ సంక్షోభంపై భారతదేశ వైఖరి అనే అంశంపై డా.జె.స్టీఫెన్ కొమ్మర, ఆఫ్ఘనిస్తాన్‌లో మానవ హక్కుల ఉల్లంఘన అంశంపై డా.కె.హరిబాబు, ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభంపై ఇస్లామిక్ ప్రపంచ స్టాండ్ అనే అంశంపై డా.ఎం.గోపి, ఆఫ్ఘన్ సంక్షోభం - భారతదేశ దిగుమతులు మరియు ఎగుమతులపై ప్రభావం అనే అంశంపై డా.పి.లక్ష్మీనారాయణ, ఆఫ్ఘనిస్తాన్ సంక్షోభం: భారతీయ ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం అనే అంశంపై డా.కె.నిర్మల తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, సుంకర నాగేంద్ర కిషోర్, ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సొసైటీ ఫర్ కమ్యూనిటీ సైకాలజీ ఇన్ యాక్షన్ (SCRA ) అమెరికా-అంతర్జాతీయ సభ్యులు,స్పోర్ట్స్ మరియు కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ మాట్లాడుతూ, ఆఫ్ఘనిస్థాన్ లో నెలకొన్న రాజకీయ పరిస్థితి వలన మానసిక, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు దిగజారకుండా శాంతియుత సమాజానికి ప్రజలందరూ,(ప్రజా వాక్కు) ముఖ్యంగా మేధావులు తమ అభిప్రాయాలను సంఘీభావాన్ని తెలియజేయాలని వివరించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొక్కా జగన్నాథరావు మానవతా దృక్పథంతో, సామాజిక స్పృహతో, ఆఫ్ఘన్ సంక్షోభం మన దేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై ఎటువంటి ప్రభావితం చేస్తుందో అనేవిషయంపై అవగాహన గోష్టి ఏర్పాటు చేయటంపై హర్ష వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు.




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## మడ అడవులపై శాస్త్రవేత్తల సహకారాలను అందుకోండి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**07.09.21 (మీడియాసెల్)** మడ అడవుల పర్యావరణ వ్యవస్థలకు సంబంధించిన అంశాలపై దేశ,విదేశాలలో ఉన్న విజ్ఞానవేత్తల సహకారాలను విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలో గురువారం జూవాలజీ,ఆక్వాకల్చర్ విభాగాలు కెపాసిటీ బిల్డింగ్ అండ్ ఇంటర్నేషనల్ నెట్ వర్కింగ్ కోసం ఉమ్మడి శాస్త్రీయ సహకార అవకాశాలపై వెబినార్ సిరీస్ ను నిర్వహించారు. "తీర సరిహద్దులు - మడ అడవులు" అనే అంశంపై జరిగిన ఈ వెబినార్ కు కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ మడ అడవుల పర్యావరణ వ్యవస్థ యొక్క ప్రాముఖ్యాన్ని వివరించారు.మడ అడవుల పర్యావరణ వ్యవస్థను కాపాడాలని తెలియజేశారు.వెబినార్‌ను ఉపయోగించుకొని విద్యార్థులు ఎక్స్ ఛేంజ్ అండ్ జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్ ల ద్వారా ప్రయోజనాలను పొందవచ్చునన్నారు. వివిధ శాఖలలో బయోలాజికల్, ఎన్విరాన్మెంటల్ అండ్ సోషల్ సైన్సెస్, రిమోట్ సెన్సింగ్ , జి.ఎస్.ఎస్. వంటి సబ్జెక్టుపై పట్టు ఉన్న విద్యార్థులు విశ్వవిద్యాలయంలోని ప్రత్యేక ఆసక్తి సమూహాలతో తమ పోస్ట్ గ్రాడ్యుయేట్, పరిశోధనను కొనసాగించవచ్చునని తెలియజేశారు. అంతర్జాతీయ ఇంటర్ డిసిప్లినరీ ప్లాట్ ఫామ్ ద్వారా ప్రముఖ శాస్త్రవేత్తల పర్యవేక్షణతో ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలన్నారు. రిసోర్స్ పర్సన్ మలేషియాలోని టెరెంగను యూనివర్సిటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ అండ్ ఎన్విరాన్మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.సత్య నారాయణ మాట్లాడుతూ వీసీ జగన్నాథరావు సూచించిన ఉమ్మడి సహకారాలతో విజ్ఞాన పరమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని స్వాగతించారు. తీర సరిహద్దులు - మడ అడవులకు సంబంధించి విద్యార్థులకు విద్య, పరిశోధన, ప్రాజెక్టులలో పూర్తి సహకారాన్ని అంది స్తామని తెలియజేశారు. కోరింగ మడ అడవుల యొక్క చారిత్రక ప్రాముఖ్య తను వివరించారు. ముఖ్యంగా కార్బన్ సీక్వెస్ట్రేషన్ పరంగా మరియు ప్లాస్టిక్, చెత్త వంటి కాలుష్యం చివరకు మడ అడవుల క్షీణతను గురించి తెలియజేశారు. రిసోర్స్ పర్సన్ శ్రీలంకలోని రుహునా యూనివర్సిటీ బోటనీ విభాగ సీనియర్ లెక్చరర్ డా.సునంద కోడికర ఆరచిలేజ్ (Dr. Sunanda Kodikara Arachchilage) మాట్లాడుతూ శ్రీలంక మడ అడవుల నీలిరంగు కార్బన్ విషయాలు, వాతావరణ మార్పుల ఉపశమనం పై ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కన్వీనర్, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## సంపాదకీయం



# సర్వ విఘ్నోప శాంతయే!

చిన్న చిన్న కళ్ళు... ప్రతి అంశాన్ని సూక్ష్మంగా గ్రహించి నేర్చుకోవాలని. చేటల్లాంటి చెవులు... ఎక్కువగా వినాలి. చేటతో చెరుగుతున్నప్పుడు రద్దంతా పోయి సారం మాత్రమే మిగులుతుంది. అలాగే అన్నీ వినాలి, పనికొచ్చే అంశాల్ని మాత్రమే మిగుల్చుకోవాలి. విశాలమైన పొట్ట. విద్యలకు అది పెట్టె. పొడవైన తొండం. విజ్ఞానం విశాలమైంది, లోతైంది. పొడవైంది. అపరిమితమైన విజ్ఞానాన్ని సంపాదించుకోవాలనేది సూచన. గణపతి వ్యాస మహర్షికి లేఖకుడు. ఆయన దంతమే లేఖన సాధనం. మోదకాలు మధుర పదార్థాలు. తీపి తీపిగా ఉన్నవన్నీ ఆయనకిష్టం. జ్ఞానం ఆహారం లాంటిది. ఇతరులకు పంచుతున్నప్పుడు అది మధురంగా ఉండాలి.

విలువైనదవ్వాలి. ఆయన దగ్గర అనింద్యుడు అనే ఎలుక ఉంటుంది. నిందలు లేనివాడు అని అర్థం. నిందలు లేనివాడే ప్రజలందరికీ వందనీయుడవుతాడు. నమస్కరింపబడతాడు. గౌరవం కలుగుతుంది. కొత్తగా చెప్పుకోవాలంటే విజ్ఞానానికి సంకేతమైన గణపతి కంప్యూటర్. అనింద్యుడు మౌస్. నడిపించేది అతడేగా! ప్రస్తుతం లోకాన్ని నడిపిస్తున్నది కంప్యూటర్.

శుక్లాం ,అంబరధరం... తెల్లని వస్త్రాలు ధరించినవాడు. నిర్మలమైన జ్ఞానానికి తెలుపు సంకేతం. సర్వ శుక్లా సరస్వతి అని కదా అర్థం. విష్ణుం, శశివర్ణం... సర్వవ్యాపకమైన సుఖాన్నిచ్చే వర్ణం - అంటే అక్షరం! అక్షరమే కదా అంతా నిండి ఉన్నది. మనల్ని నడిపించేది. చతుర్భుజం... నలువైపులా వ్యాపించటం, మనిషి చెట్టులాంటి వాడు. అన్ని వైపులకు విస్తరిస్తాడు. నీడనిస్తాడు. ఫలాలను అందిస్తాడు. పదిమందికి ఉపయోగపడతాడు. అదే మనిషి లక్షణం కావాలి. ప్రసన్న వదనం... ఏది చెప్పినా, చేసినా ప్రసన్నంగా ఉండాలి. అందరూ ఇష్టపడాలి. ఇష్టపడే పనులే చెయ్యాలి. అటువంటి వారే గౌరవింపబడతారు. సర్వ విఘ్నోప శాంతయే!... సమస్త ఆటంకాలను తొలగించువాడని అర్థం. "శ్రేయాంసి బహువిఘ్నాని" అని ఒక మాట ఉంది. మంచి పనులకు ఎప్పుడూ ఆటంకాలు ఉంటాయని. వాటిని దాటుకుని ఛేదించుకుంటూ ముందుకు వెళ్ళటమే. కాసే చెట్టు మీదికే రాళు విసురుతారు. జ్ఞానానికి, విద్యాదానం చేసే వ్యవస్థలకు ఆటంకాలు కలిగించకూడదు. కత్తి కట్టకూడదు. బురద చల్లకూడదు. ఎవరు చేసినా అది పాపకార్యమే! ధ్యాయేత్ ... అటువంటి ఆటంకాలను తొలగించుమని విఘ్నేశ్వరుని అందరూ కలసి ప్రార్థిద్దాం!

*గణపతి బొప్పా మోరియా!!*

# జాతీయ పోటీ పరీక్షలలో విజయాలు సాధించాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**09.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీపరీక్షలలో విజయాలు సాధించాలని ఉన్నత స్థానాలలో స్థిరపడాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుఅన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కెమిస్ట్రీవిభాగం ఆధ్వర్యంలో నెట్ (నేషనల్ ఎలిజిబులిటి టెస్ట్), గేట్(గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్) కు సంబంధించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ నెట్, గేట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలలో విశ్వవిద్యాలయ విద్యార్థులు విజయాలు సాధించి ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని అన్నారు. నెట్ పరీక్షలో అర్హత సాధించడం ద్వారా అధ్యాపకులుగా రాణించవచ్చునని, గేట్ పరీక్షలో అర్హత సాధించడంద్వారా ఓ.ఎన్.జి.సి., గెయిల్, సి.టి.ఆర్.ఐ. వంటి సంస్థలలో అవకాశాలు లభిస్తాయని అన్నారు. విశ్వవిద్యాలయంలో తొలిసారిగా చేపట్టిని జాతీయ పోటీ పరీక్షల అవగాహన శిక్షణ తరగతులు అన్ని విభాగాలలో నిర్వహించేందుకు సంబంధింత కళాశాలలు ప్రత్యేక దృష్టిని సారించాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలో బోధనతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే ఉద్యోగావకాశాలకు మార్గనిర్దేశం చేసే విధంగా గురువులు ఉండాలన్నారు. రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన రాజమహేంద్ర వరం ఓ.ఎన్.జి.సి. కెమిస్ట్ ఎ. అప్పలరాజు మాట్లాడుతూ మొక్కా జగన్నాథరావు లాంటి గురువు వీసీగా రావడం ఆదికవినన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు అదృష్టమని అన్నారు. విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి వారికి అవసరమైన విద్య, విజ్ఞానం, పరిశోధన, ఉద్యోగావకాశాలకు మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు. జగన్నాథరావు మార్గదర్శకంలో తనలాంటివారెందరో ఆయా ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడ్డారని కృతజ్ఞతలు తెలియజేశారు. కెమిస్ట్రీ విద్యార్థులు నెట్, గేట్ పరీక్షలకు ఏ విధంగా సిద్ధపడాలో, పరీక్ష మెలకువలను వివరించారు. విద్యార్థులకు నెట్, గేట్ పరీక్షలపై అవగాహన కల్పించి శిక్షణ అందించిన అప్పలరాజును వీసీ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్. డా. ్ర ఎస్. రమణేశ్వరి, ఈసీ మెంబర్ డా. బి. జగన్మోహనరెడ్డి, విభాగాధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




అప్పలరాజును సన్మానించి అభినందిస్తున్న వీసీ

# త్వరలో కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభిస్తాం

### వీసీ మొక్కా జగన్నాథరావు

**10.09.21 (మీడియాసెల్)** ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి మొక్కా జగన్నాథ రావు సందేశమిస్తూ ఆత్మహత్య చేసుకోవడం అనేది ఒక పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ముఖ్యంగా స్టూడెంట్స్ మార్కులు సరిగ్గా రాలేదని, పరీక్ష పాస్ అవ్వలేదని, ఆకర్షణను ప్రేమగా భావిస్తూ తిరస్కరించారని ఆత్మహత్య చేసుకోవటం, హత్యలు చేయటం, యాసిడ్ దాడులు, ఫ్రెండ్స్ మాట్లాడలేదని, టీచర్ తిట్టారని కొట్టారనే కారణాలతో వాళ్ల అపురూప జీవితాలని నాశనం చేసుకుంటున్నారని, మనిషి తలుచుకుంటే ఏదైనా సాధించగలడనే ఆలోచన వాళ్లలో కల్పించేలా చాలా కార్యక్రమాలు యూనివర్సిటీ పరిధిలో పిల్లలకు ఉపయోగపడే విధంగా నిర్వహించాలని సైకాలజీ విభాగాన్ని కోరారు. మానసిక ఆందోళనకు గురవుతున్న పిల్లలను గుర్తించి వారికి కౌన్సిలింగ్ చేయాలని వాళ్ల జీవితాలకు భరోసా ఇచ్చే విధంగా తయారు చేయాలని కోరారు. ఇందుకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఒక కౌన్సిలింగ్ సెంటర్ ను ప్రారంభించ బోతున్నామని తెలియజేశారు. ఈ కౌన్సెలింగ్ సెంటర్ నిష్ణాతులైన సైకాలజీ అధ్యాపకుల ద్వారా యూనివర్సిటీలో చదువుతున్న పిల్లలకు, అనుబంధ కళాశాలల్లో చదువుతున్న పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తారని తెలియజేశారు.





### కౌన్సిలింగ్ సేవలకు సిద్ధంగా ఉన్నాం

డబ్ల్యూ. హెచ్. ఓ. చర్యల ద్వారా ఆశను సృష్టించటం అనే అంశంతో ఈ ఏడాది ప్రేరణనిచ్చింది. ఆత్మహత్య ఆలోచనలు చాలా సంక్లిష్టంగా ఉంటాయి. సహాయం కోరడానికి స్టిగ్మా ఒక ప్రధాన అవరోధం. మీరు శ్రద్ధ వహిస్తున్నారని చూపించడం ద్వారా, భరోసా కల్పించటం ద్వారా ఎవరికైనా వారి జీవితం పైన ఆశ కల్పించడంలో సహాయపడవచ్చు. ఆత్మహత్య యొక్క ప్రత్యక్ష అనుభవం ఉన్న వ్యక్తుల అనుభవాలు మనకు ఉదాహరణలుగా ఉపయోగపడతాయి. వీసీ గారి ప్రోత్సాహంతో కౌన్సిలింగ్ సేవలు అందించటానికి మా విభాగం సిద్ధంగా ఉంది.

**- డా. పడాల రాజశేఖర్**
**సైకాలజీ విభాగాధిపతి.**



## ప్రాసస్ మోడలింగ్ కంట్రోల్‌లో అభివృద్ధి అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**08.09.21 (మీడియా సెల్)** ఆధునిక యుగంలో ప్రాసస్ మోడలింగ్ కంట్రోల్ ద్వారా ఎన్నో ప్రయోజనాలను అందుకుంటున్నామని, దీనిలో మరింత సాంకేతిక విజ్ఞాన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారామంచి ఫలితాలు వస్తాయని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ బుధవారం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, డిపార్టమెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్టుమెంటేషన్ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. "ప్రాసెస్ మోడెలింగ్అండ్ కంట్రోల్ లో ఆధునిక పోకడలు" అనే అంశంపై నిర్వహించిన ఈ వెబినార్ కు కన్వీనర్ గా డా.డి.శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలు ప్రాసస్ మోడలింగ్ అండ్ కంట్రోల్ నూతన విధానాలను అవలంభిస్తూ ప్రగతి పథంలో పయనిస్తున్నాయని అన్నారు. భారీ కర్మాగారాలు,ఫ్యాక్టరీలలో ప్రాసస్ మోడలింగ్ కంట్రోల్ ను ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ పనిని పూర్తిచేస్తున్నారని చెప్పారు. ఫ్యాక్టరీలలో ప్రాసస్ మోడలింగ్ కంట్రోల్ ద్వారా సమయం,ఖర్చుఆదా కావడంతో పాటు ఉత్పత్తిలో నాణ్యత పెరుగుతుందన్నారు. కొన్ని ఫ్యాక్టరీలలో తీవ్ర ఉష్ణోగ్రత ద్వారా సంభవించే ప్రమాదాలను కంట్రోల్ చేయడానికి, భద్రతగా పని చేస్తుందని చెప్పారు.ప్రాసస్ మోడలింగ్ కంట్రోల్ లో మెరుగైన సాంకేతి కతను, నైపుణ్యతను ఉపయోగించి ఎంతో అభివృద్ధిని సాధించవచ్చునన్నారు. రిసోర్సు పర్సన్ గా చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్సిట్యూట్ అడయార్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా.రమేష్ చంద్ర పాండా మాట్లాడుతూ ప్రాసెస్ మోడెలింగ్అండ్ కంట్రోల్ లో ఆధునిక పోకడలను గురించి వివరించారు. భారతదేశంలోని వివిధ ఫ్యాక్టరీలుప్రాసెస్ మోడెలింగ్ అండ్ కంట్రోల్ ను ఏ విధంగా మెరుగుపరచుకొని అభివృద్ధిని సాధించాయో ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, కన్వీనర్ డా.డి.శ్రీనివాసరావు,కోకన్వీనర్లు జె.హనుమంతు, డా.డి.కిషోర్ సాంకేతిక సహకారం వెబ్ మాస్టర్ మంచెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జియాలజీ బోధిస్తున్న వీసీ జగన్నాథరావు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**06.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సోమవారం యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలను పరిశీలించారు. దీనిలో భాగంగా జియాలజీ విభాగాన్ని సందర్శించిన వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి విద్యార్థులతో సంభాషిస్తూ సుమారు గంటసేపు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా వీసీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జియాలజీ, జియోఫిజిక్స్ కోర్సులకు దేశ విదేశాలలో ఎంతో డిమాండ్ ఉందని అన్నారు. కెనడా వంటి దేశాలలో జియాలజీపై పట్టు ఉన్న వారికి మెండైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. జియాలజీ, జియోఫిజిక్స్ మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేస్తూ వాటిలోని మెలుకువలను సూచించారు. చమురు,ఖనిజాలు, ఆభరణాలు ఇలా మానవ జీవితంలో ప్రధాన భూమికను పోషించేవన్ని జియాలజీతో సంబంధం ఉన్నవేనని గుర్తు చేశారు. భూమి ఆవిర్భావం, మానవుని పరిణామం వంటి చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ భూమిపై ఉన్న జీవరాశులలో మానవుడు అత్యంత స్వల్పమైన చివరిదశ జీవి అని తెలియజేశారు. జియాలజీ విద్యార్థులు సహజవనరులపై పూర్తి పరిజ్ఞానాన్ని సంపాదించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై పెట్టుకున్న నమ్మకాలను కాపాడుకుంటూ మంచి పిల్లలుగా, ఉత్తమ పౌరులుగా సమాజానికి సేవలందించాలని తెలియజేశారు. విభాగాధ్యాపకులతో మాట్లాడుతూ జియాలజీ క్లబ్ ను ఏర్పాటు చేసి ప్రతివారం విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అధ్యాపకులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలని, విద్యార్థుల ప్రగతిని గురువులు కోరుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి,ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.నూకరత్నం, డా.కె.వి.స్వామి, డా.శామ్యూల్ పీటర్ మరియు విభాగాధ్యాపకులు పాల్గొన్నారు.

## డిగ్రీ ఐదవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ


పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ

**07.09.21 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. మంగళవారం వీసీ కార్యాలయంలో ఆయన ఫలితాలు విడుదల చేసి వివరాలను తెలియజేశారు. ఉభయగోదావరి జిల్లాల్లోని 24,942 మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలు రాశారని వారిలో 17,044 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 68.33 అని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునన్నారు. కొవిడ్ సమయంలో సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన విశ్వవిద్యాలయ పరీక్షా విభాగ అధికారులను, సిబ్బందిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్స్ డీన్ డా.ఎ.మట్టారెడ్డి, అసిస్టెంట్ డీన్ డా.డి.కళ్యాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి పాల్గొన్నారు.

## మార్గదర్శకుడు గురువే!

అమ్మ జన్మనిస్తే ....
నాన్న నడక నేర్పుతాడు,
బ్రతుకుతెరువును మాత్రం
నేర్పేది గురువే
అమ్మ,నాన్నలు దైవాలైతే
మార్గదర్శకుడు గురువే కదా ..
మాతృమూర్తుల తరువాత
అంతటి ..
ఉన్నత స్థానాన్ని
అందుకున్నందునే ..
గురువు మార్గదర్శకుడయ్యాడు
ఎందరో జీవితాలకు
ఇలా అదర్శుడై ..
సత్ప్రవర్తన, సహనశీలత కలిగి
సమాజ హితం కోరుకుంటూ
గురు బ్రహ్మ .. గురు విష్ణు ..
గురు దేవోభవ.. అంటూ ..
కీర్తింపబడుతున్న ఓ గురుదేవ!
వందనం! అభినందనం!!

- ఎమ్మీవ్వ. రమణ గంధం,
రాజానగరం.

## మినీజాబ్ మేళాలో 84 ఉద్యోగాలు

**07.09.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో వికాస సంస్థ నిర్వహించిన మినీజాబ్ మేళాలో 84 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆయా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు వీసీ జగన్నాథరావు నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో వికాస జాబ్ మేళా ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించాయని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికాస సంస్థ ప్రత్యేకతను సంపాదించుకుందని అభినందించారు.గోదావరి జిల్లాల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థులకు త్వరలో విశ్వవిద్యాలయంలో వికాస వారి మెగా జాబ్ మేళాను ఏర్పాటుకు చేసేందుకు ప్రయత్నిస్తామని అన్నారు.కోజెంట్ లో 60 మంది, డక్కన్ కెమికల్స్ లో 08 మంది, హుండైమోరిస్ లో 12 మంది, టెక్ టీమ్ సోల్యూషన్స్ నలుగురు అభ్యర్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించి అభినందనలు తెలియజేశారు. ఉన్న ఉద్యోగంలో అనుభవాన్ని సంపాదించుకొని ఉన్నత ఉద్యోగాలలో చేరాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, వికాస మేనేజర్ పి.శ్రీకాంత్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎన్.పవన్ పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందిస్తున్న వీసీ జగన్నాథరావు

## వైస్ ఛాన్స్‌లర్ డెస్క్



సెప్టెంబర్ 10 ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా డబ్ల్యూ.హెచ్.ఓ. "చర్యద్వారా ఆశను కల్పించటం" ఉపశీర్షికతో ఈ ఏడాది సమాజానికి అవగాహన కల్పిస్తోంది. తన జీవితాన్ని తానే స్వచ్ఛందంగా అంతం చేసుకోవాలనే ఆలోచన పిరికిచర్య. వాస్తవానికి ఆత్మహత్య పిరికివాని చివరి చర్య. ఆకర్షణను ప్రేమగా భావించి ఎందరో తమ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారు. ప్రేమ మనసుకు చెందిన అంశం. ఆకర్షణ శరీరానికి చెందింది. ఈ అవగాహన నేటి యువతకు చాలా అవసరం. చదువును ప్రేమించాలి. తల్లిదండ్రులను ప్రేమించాలి. లక్ష్య సాధన పట్ల అవగాహన కలిగి విజయపథం వైపు నడవాలి. "బలమే జీవనం - బలహీనతే మరణం" అన్నారు స్వామి వివేకానంద. యువత ఒత్తిడిని జయించి, పరిపక్వతతో ఆలోచించి సమాజం పట్ల అవగాహన కలిగి నేటి యువత,విద్యార్థి లోకం విలువైన జీవితాన్ని పొందాలని కోరుకుంటున్నాను.

సర్వత్ర విద్యయా వర్ధతే ప్రజా

మొక్కా జగన్నాథరావు



## మంచి మాట

వివేకంతోనూ,
విజ్ఞానంతోనూ,
విలువలతోనూ,
జీవించినదే...
నిజమైన జీవితం!

- తైత్తరీయోపనిషత్

# ఆదర్శ అధ్యాపకులు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్

విఖ్యాత మానవ శాస్త్రవేత్త మార్గరెట్ మీడ్ తన బాల్యంలో అధ్యాపకుడంటే ఎవరని తన తండ్రిని ప్రశ్నించింది. "నిరంతరం శాస్త్ర అధ్యయనం చేస్తూ, తను నేర్చుకున్న విజ్ఞానాన్ని ఇతరులకు బోధించేవాడే" అధ్యాపకుడని తండ్రి సమాధానం ఇచ్చారు. ఇది ఎంతటి అద్భుతమైన, అసాధారణమైన వివరణ కదా!
డా.రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడు, మేధావి, తాత్వికుడు, మూర్తీ భవించిన మానవతావాది.

డా" రాధాకృష్ణన్ జన్మదినమైన సెప్టెంబర్ 5వ తేదిని భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సంగా జరుపుకుంటున్నాము. ఉపాధ్యాయునిగా ఆయన జీవన ప్రస్థానాన్ని ఈ వ్యాసంలో వివరించటానికి ప్రయత్నిస్తున్నాను.

గ్రీకు తత్త్వవేత్త ప్లాటో తాత్వికుడైన పాలకుడు, మనభారతీయ ఆలోచనలో రాజర్షి పోలికలు రాధాకృష్ణన్‌లో కనిపిస్తాయి. మనకు చరిత్రలో మార్కస్ ఆరిలియస్, జనకుడు, అశోకచక్రవర్తి, అక్బర్ చక్రవర్తులలో ఈ రకమైన సామ్యం కనిపిస్తుంది. మళ్ళీ మనకు ఆధునిక కాలంలో డా.రాధాక్రిష్ణన్ 1962లో భారత రాష్ట్రపతిగా ఎన్నికై పదవిని నిర్వహించిన కాలం ఇలాంటి పోలిక కనిపిస్తుంది. క్రైస్తవ మతప్రవక్త పోప్ 1964లో డా. రాధాక్రిష్ణగారిని *"cheifs of Golden army of Angels"* అనే బిరుదుతో సన్మానించారు.

## రాధాకృష్ణన్ బాల్యం

సెప్టెంబర్ 5, 1888 లో ఆంధ్ర, తమిళ సరిహద్దులోని తిరుత్తణి అనే చిన్న పట్టణంలో తెలుగు కుటుంబంలో రాధాక్రిష్ణన్ జన్మించారు. కుటుంబ నేపధ్యంలో రాధాకృష్ణన్‌లోని "జ్ఞానతృష్ణ" వారిని స్కూలు, కళాశాల చదువుల్లో ఉన్నతుడిగా నిలబెట్టాయి. మద్రాసులోని క్రిష్టియన్ కళాశాలలో చదివేటప్పుడు రాధాక్రిష్ణన్ గారి సీనియర్ సోదరులు స్టేట్ సైకాలజీ, వెల్టన్ లాజిక్(తర్కం) మెకంజీచే వ్రాయబడిన "నీతి శాస్త్రము" పాతపుస్తకాలను కానుకగా అందించారు. కళాశాలలో తత్త్వశాస్త్రము ప్రధాన అధ్యయన అంశంగా చదివారు. ఫిలాసఫీని యాదృచ్ఛికంగా తీసుకున్నప్పటికీ కాలంలో జరిగిన అనేక సంఘటనలు తనకు తత్వశాస్త్రం పట్ల అభిమానాన్ని కలిగించాయన్నారు రాధాకృష్ణన్. జీవితమంటే మనకు సంబంధించిన భౌతికమైన కారణాలు మాత్రమే కాదన్నారు. జీవితంలో మనకు వచ్చే అవకాశాలు యాదృచ్ఛికం కాదనీ, దానికి కార్యకారణ సంబంధాలు ఉంటాయన్నారు రాధాకృష్ణన్. మన విశ్వం జీవ పదార్ధమని, మన జీవితంలో జరిగే సంఘటనలు యాదృచ్ఛికం కాదనీ, దైవ ప్రేరితాలని అనిపిస్తుందంటారు రాధాకృష్ణన్. మద్రాస్ క్రిష్టియన్ కళాశాల వాతావరణం యువ రాధాకృష్ణన్ జీవిత ఆలోచనా విధానంపై అనుకూల మరియు ప్రతికూల ప్రభావాన్ని చూపింది. కొత్తనిబంధన గ్రంథములో అంశాలు రాధాకృష్ణన్‌పై ప్రభావాన్ని చూపాయి.

## రాజమహేంద్రవరం, మద్రాస్‌లో ఉపాధ్యాయునిగా రాధాకృష్ణన్

అప్పటి రాజమహేంద్రి ఆర్ట్స్ కళాశాల గోదావరి నదీ తీరంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఆర్ట్స్ కళాశాలగా ఆంధ్రదేశంలో ప్రఖ్యాతి గడించింది. 1853 లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా స్థాపించబడి, 1868 లో మద్రాస్ ప్రెసిడెన్సీలో పాఠశాలగా ఉన్నత శ్రేణిని పొందింది 1858 లో కళాశాలగా రూపుదిద్దుకుంది. 1891లో మద్రాస్ విశ్వవిద్యాలయమునకు అనుబంధ కళాశాలగా, తర్వాత 1926 లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ అనుబంధకళాశాలగా మారింది. 1916 నుండి 1918 వరకు డా.రాధాకృష్ణన్ ఉపాధ్యాయులుగా ఇక్కడ పనిచేశారు.

డా.రాధాకృష్ణన్ ఉపన్యాసాలలో విషయ పరిజ్ఞానం, వైవిధ్యం, సులభ శైలి మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. నమ్మదగిన ఆధారాల ప్రకారం రాధాకృష్ణన్ తన తొలినాళ్ళలో(20లలో) సంప్రదాయాలకు భిన్నంగా కోపం, క్రమశిక్షణా రాహిత్యం, ఉద్రేకం ప్రదర్శించేవారని తెలుస్తుంది. తర్వాతి కాలంలో తన ప్రవర్తనా లోపాలను అధిగమించి, పరిణతి చెందిన వ్యక్తిగా మారారు. ప్రెసిడెన్సీ కళాశాలలో 1912 లో ఆయన చేసిన ప్రసంగాలను "మనస్తత్వ శాస్త్ర మౌలిక విషయాలు" అనే మకుటంతో ఆక్స్ ఫర్డ్ విశ్వ విద్యాలయం ప్రెస్ ప్రచురించింది. 27 సంవత్సరాలు వచ్చేసరికే, గొప్ప రచయితగా ప్రసిద్ధి పొందారు. కర్మ మరియు స్వతంత్ర ఆలోచన, గ్రీసులో ప్రకృతి మరియు సంప్రదాయాలు, భగవద్గీతలో చెప్పబడిన నైతిక సూత్రాలు మరియు ఇమ్మాన్యూయల్ కేంట్ ఆలోచనలు, దేవుని పై



బెర్గ్సన్ అభిప్రాయలు, విద్యలో నైతిక నియమాలు, మతం, మొదటి ప్రపంచ యుద్ధం పై భారత దేశ ఆలోచనలు తదితర విషయాలపై రాధాక్రిష్ణన్ వ్యాసాలు రాశారు.

అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మోనిస్ట్, దిక్వెస్ట్, మైండ్, ది జర్నల్ అఫ్ ఫిలాసఫీ, ది ఇంటెర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇథిక్స్ జర్నల్స్ లో రాధాకృష్ణన్ వ్యాసాలు ప్రచురించబడ్డాయి. వాస్తవానికి డా. రాధాకృష్ణన్ ద్వితీయ వ్యాసం "మొదటి ప్రపంచ యుద్ధంపై భారతదేశ ఆలోచన" పత్రికలపై ఉండే సెన్సార్ వల్ల ప్రచురించబడలేదు. 1916 రాధాక్రిష్ణన్ పదోన్నతిని పొంది రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో ఆచార్యుడిగా నియమించ బడ్డారు. కొద్దికాలంలోనే అందరి చేత గౌరవింపబడే, ఆదర్శ ఉపాధ్యాయుడిగా లబ్ద ప్రతిష్ఠులైనారు. 1918 వరకు ఆయన రాజమండ్రిలో పని చేశారు. అధ్యాపకునిగా రాజమండ్రిలో పనిచేసిన కాలం తన జీవితంలో చిరస్మరణీయమైన, సంతోషకరమైన రోజులుగా అభివర్ణించారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో పనిచేసే కాలంలోనే "రవీంద్రనాథ్ ఠాగూర్ తత్వం" అనే పుస్తకం 1918లో ప్రచురితమైంది.

రవీంద్రుని ఉదాత్తమైన తాత్విక భావనలు, మన విశ్వానికి అందని ఆలోచనలని, అయితే రవీంద్రుని ఆలోచనలలో వైవిధ్యం ఉంటుందని, సంక్లిష్టతలేని, స్పష్టమైన ఉదాత్త భావనలని, డా. రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు.

## మైసూరు నుండి కలకత్తా విశ్వవిద్యాలయానికి...

డా.రాధాకృష్ణన్ గారు 1916 లో భారతీయ తత్వశాస్త్ర ఆచార్యునిగా మైసూరు విశ్వవిద్యాలయంలో నియమింప బడ్డారు. మైసూరు విశ్వవిద్యాలయంలో ఉండగానే బుద్ధి (ఆలోచన) అనే అంశానికి సంబంధించిన వ్యాసాలు వ్రాస్తూ, ఆ వ్యాసాలలో తరచూ బెర్గ్సన్ తత్వాన్ని అనుశీలనం చేశారు. "సమకాలీన తత్వశాస్త్రంలో మతం పాత్ర" అనే ద్వితీయ గ్రంథాన్ని 1920 లో ప్రచురించారు. అప్పుడే విలియంజేమ్స్, రుడాల్ఫ్ ఆరిన్, జేమ్స్ వార్డ్, లిబనీజ్ తదితర తత్వవేత్తల ఆలోచనలను మదింపు చేసుకొనేవారు. తత్వశాస్త్రంపై మతం అనుచితమైన ప్రభావాన్ని ఖండించేవారు. తత్వశాస్త్రంలో మతాన్ని ప్రాతిపదికగా గాని , ప్రభావితం చేసే అంశంగా గాని రాధాకృష్ణన్ అంగీకరించలేదు.

భారతీయ తత్వ వేతల్లో అగ్రగణ్యుడైన భజేంద్రనాధ్ సీల్ వారసుడిగా కలకత్తా విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర ఆచార్య పీఠం అధిరోహించారు రాధాకృష్ణన్. ఆ కాలంలోనే 1923 లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రాధాకృష్ణగారి తలమానికమైన గ్రంథం "భారతీయ తత్వశాస్త్రం" మొదటి భాగం ప్రచురితమైనది. ఆ గ్రంథం యొక్క ప్రభావం ఇంత అంత కాదని, ఆ రోజులల్లో భారతీయ విశ్వవిద్యాలయాలలో ఆ గ్రంథం గొప్పగా కొనియాడబడేది.

చిన్న పట్టణాల్లో, గొప్ప గొప్ప నగరాల్లో, ఆంధ్ర విశ్వకళాపరిషత్, బెనారస్ విశ్వవిద్యాలయం ఉప కులపతి గా ఆక్సఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా మాస్కోలో భారత రాయబారిగా, ఉపరాష్ట్రపతిగా,రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ వివిధ హెూదాలలో సేవలందించారు. వారిని నిశితంగా పరిశీలిస్తే గొప్ప ఆచార్యునిగా, విఖ్యాత తత్వవేత్తగా, గొప్ప మానవతా వాదిగా మనకు గోచరిస్తారు, అన్నిటికి మించి రాధాకృష్ణన్ విశ్వమానవమూర్తిగా, గొప్ప మేధావిగా, ఆలోచనా పరుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా మనకు కనిపిస్తారని , నోబెల్ గ్రహీత, భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్ రాధాకృష్ణన్ ను కీర్తించారు. ఆచార్యదేవోభవ!

రచయిత: డాక్టర్ వి.కె.రాజు,
MD,FRCS,FACS. ఐ ఫౌండేషన్ అఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు, గౌతమి నేత్రాలయము రాజమండ్రి వ్యవస్థాపక అధ్యక్షులు, వెస్ట్ వర్జీనియా విశ్వవిద్యాలయంలో క్లినికల్ ప్రొఫెసర్.

తెలుగు అనువాదం:
పాలకొల్లు శ్రీనివాసరావు,
సీనియర్ అడ్వొకేట్, రాజమహేంద్రవరం.